క్లుప్తంగా

ఘనంగా లయన్స్ ప్రపంచ సేవా దినోత్సవం



వృద్ధులకు పౌష్టికాహారాన్ని అందజేసిన ప్రాంతీయ చైర్మన్ పద్మతులసి

కాకినాడ రూరల్: ప్రపంచంలోనే అతిపెద్ద సేవా సంస్థ లయన్స్ క్లబ్ విస్తృత సేవలు అందిస్తూ మహా వట వృక్షంలా వేళ్లానుకుందని లయన్స్ ప్రాంతీయ చైర్మన్ పద్మతులసి పేర్కొన్నారు. రమణయ్యపేటలో క్లబ్ ప్రపంచ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని వృద్ధులకు పౌష్టికాహారాన్ని ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1917 అక్టోబర్ 8న అంతర్జాతీయ స్థాయిలో తొలి సమావేశం జరగడంతో అప్పటి నుంచి ప్రపంచ సేవా దినోత్సవంగా అన్ని లయన్స్ క్లబ్‌లు వివిధ సేవలు అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు అడబాల రత్న ప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, ప్రసాద్ నాయుడు, సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు బుద్ధరాజు సత్యనారాయణ రాజు, కుమార యాదవ్, రాజా తదితరులు పాల్గొన్నారు.

వార్డు సభ్యులకు ముగిసిన శిక్షణ

కాకినాడ రూరల్: రమణయ్యపేట సర్పవరం జంక్షన్ వద్ద మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణ మంగళవారంతో ముగిసింది. శిక్షణ తరగతులను సోమవారం ఉదయం ఎంపీపీ బందిలి వీరీష ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామాభివృద్ధికి వచ్చే నిధులు, గ్రామాల్లో పారిశుధ్యం తదితర అంశాలపై ఇంద్రపాలెం, రమణయ్యపేట పంచాయతీ కార్యదర్శులు ప్రసాద్, జొన్నాడ నరసింహరావు అందించారు. ఎంపీడీఓ సతీష్, ఈఓ పీఆర్ అండ్ ఆర్డీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శాంసంగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

కాకినాడ సిటీ: తమిళనాడు పెరంబదూర్ సామ్‌సంగ్ ఇండియా ప్లాంట్ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని కోరతూ సీఐటీయూ ఆధ్వర్యంలో కాకినాడ మెయిన్‌రోడ్డులోని సామ్‌సంగ్ షోరూమ్ వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దువ్వా శేషుబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్, సీఐటీయూ నగర కన్వీనర్ మలకా రమణ, కో కన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ సామ్‌సంగ్ పరిశ్రమలో నెల రోజులుగా 1500 మంది కార్మికులు వేతనాలు పెంచాలని కోరతూ నిరవధిక సమ్మె చేస్తున్నారన్నారు. వారి సమస్యలు పరిష్కరించాలని నాయకులు కోరారు. నాయకులు పి సూర్యారావు, పి.కుమార్‌స్వామి, పి.రాజేంద్ర ప్రసాద్, అనపర్తి ఏడుకొండలు, రవి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ హ్యాట్రిక్ విజయం

బోట్‌క్లబ్: హర్యానాలో మూడో సారీ బీజేపీ విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టిందని బీజేపీ జిల్లా అధ్యక్షులు చిలుకూరి రామ్‌కుమార్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో హర్యానాలో బీజేపీ విజయం సాధించినందుకు మంగళవారం కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. హర్యానా ప్రజలు ప్రధానమంత్రి నరేంద్రమోడీపై పాలనపై ఉన్న విశ్వాసాన్ని ఓటు ద్వారా తెలియజేశారన్నారు. జమ్ముకాశ్మీర్‌లో బీజేపీ విజయం సాధించాల్సినప్పటికీ అక్కడ రెండు పార్టీలు కలిసి పోటీ చేసిన కారణంగా ఓటమిపాలైందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పప్పుకూటికీ ఎసరు!

- పండగనాడు కందిపప్పు పంపిణీకి ఎగనామం
- రేషన్ షాపుల్లో 70 శాతం మందికి మొండిచేయి
- దసరా పండుగ నాడూ పచ్చడి మెతుకులే దిక్కు



ఎండీయూ వాహనాల వద్ద రేషన్ సరుకులు తీసుకునేందుకు క్యూ కట్టిన ప్రజలు

కాకినాడ సిటీ: సర్వమతాల ప్రజలు ఎంతో సరదాగా జరుపుకొనే దసరా పర్వదినాన కూడా పేదలు పప్పన్నం తినే అదృష్టానికి నోచుకోలేదు. ఈనెల నుంచి రేషన్ కార్డుదారులకు కంది పప్పు సరఫరా చేస్తామని ప్రకటించిన సీఎం చంద్రబాబు ఆంధ్రులకు దసరా కానుకగా మరో బూటకాన్ని వండి వార్చారు. రేషన్ షాపులకు కేవలం ఎప్పటిలాగే బియ్యం, పంచదార సరఫరా చేసి కందిపప్పు మాత్రం 30 శాతం మందికే అందేలా చేసి చేతులు దులుపుకొన్నారు. చంద్రబాబు మాటలు నమ్మి పండగనాడైనా పప్పన్నం తినవచ్చని అనుకున్న పేదలకు పచ్చడి మెతుకులే గతయ్యాయని ప్రజలు విమర్శిస్తున్నారు. తన స్వార్థం కోసం ఎన్నో అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్న చంద్రబాబు ఈసారి మారాడని నమ్మినందుకు తగిన బుద్ధి చెబుతున్నారని ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారు. ప్రభుత్వ పగ్గాలు చేపట్టినప్పటి నుంచి నేటి వరకు ఒక్కటీ చెప్పిన పని చేయకుండా మోసం మీద మోసం చేసుకుంటూ తన నిజ స్వరూపాన్ని బయట పెట్టుకున్నాడని పేదలు వాపోతున్నారు.

అమ్మాలంటే అడవి.. కొనాలంటే కొరివి..

రేషన్ దుకాణాల్లో కందిపప్పు గురించి అడగాలంటే సమాధానం చెప్పే దిక్కు లేకుండా పోయింది. ప్రభుత్వం అరకొరగా కందిపప్పును సరఫరా చేయడంతో పేదలు ఎండీయూ వాహనాల వద్ద క్యూ కడుతున్నారు. మూడు నెలలుగా ఎండీయూ వాహనాల నుంచి కందిపప్పు సరఫరా చేయకపోవడం.. ఈసారి 30 శాతం మందికే పప్పు అందేలా చర్యలు తీసుకోవడంతో ఆ వాహనాల ద్వారా సరఫరా చేస్తున్న సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే చాలా వాహనాల వద్ద కంది పప్పు అయిపోయిందని చెబుతున్నారు. ప్రజలు కందిపప్పు కావాలని అడుగుతుంటే జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వం పూర్తి స్థాయిలో కందిపప్పు సరఫరా ఇవ్వలేదు. తాము ఎక్కడి నుంచి తెచ్చి ఇవ్వాలని డీలర్లు వారికి వివరిస్తున్నారు. బయట మార్కెట్‌లో అయినా కందిపప్పు కొని పండగ జరుపుకొందామనుకున్నా ధరలు ఆకాశన్నంటుతున్నాయి. కిలో కందిపప్పు బయట మార్కెట్లో రూ.160 పైబడి పలుకుతోంది. రేషన్ దుకాణం ద్వారా కిలో రూ.67 అందే కందిపప్పునకు అదనంగా వంద రూపాయలు వెచ్చించాలంటే పేదలు కొనలేని పరిస్థితుల్లో ఉన్నారు.

పచ్చడి మెతుకులూ కష్టమే

పండగనాడూ పచ్చడి మెతుకులంటే బాధేస్తోందని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కిలో పచ్చి మిరపకాయలు రూ.40 పలుకుంతుండగా టమాటాలు రూ.80 పలుకుతున్నాయి. దీంతో ఏదీ కొనలేని పేదలు పండగ పూటా పస్తులుండాల్సిన పరిస్థితి తలెత్తింది. గతంలో ఎన్నడూ లేని పప్పు రుచిలేని విధంగా ఈ ఏడాది దసరా పండగ జరుపుకోవాల్సి వస్తోందని పేదలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కూడా పేదల పరిస్థితిని పట్టించుకోవడం లేదని పేదలు విమర్శిస్తున్నారు. కలెక్టర్ షణ్మోహన్ చొరవ తీసుకుని రేషన్ దుకాణాల ద్వారా కార్డుదారులందరికీ కందిపప్పు, నిత్యావసర సరుకుల సరఫరాకు చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

పాపము నుంచి పరిశుద్ధతలోకి వెళ్లండి

అట్టహాసంగా ముగిసిన యువజన మహోత్సవాలు



కార్యక్రమంలో యువతకు అవగాహన కల్పిస్తున్న మూర్తిరాజు

కాకినాడ సిటీ: నేటి యువత సెల్‌ఫోన్ ద్వారా చాటింగ్, డేటింగ్ చేసి సమాజం నుంచి చీకటిలోకి వెళ్లి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని సీవైఎఫ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బీహెచ్‌వీ మూర్తిరాజు ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడ ఫెబిన్ కన్వెన్షన్ (రాగిరెడ్డి కళాక్షేత్ర)లో జరుగుతున్న సీవైఎఫ్ 27వ యువజన మహోత్సవాలు సెల్ టు హెల్ మంగళవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మూర్తిరాజు మాట్లాడుతూ పాపము నుంచి శాపంలోకి కాక పాపము నుంచి పరిశుద్ధతలోకి రండి అని యువతకు పిలుపు నిచ్చారు. సెల్‌ఫోన్ ద్వారా యువత భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారని వారికి సెల్ ఫోన్ ఎలా ఉపయోగించాలి? ఎంత వరకూ పరిమితం కావాలి? సెల్‌ఫోన్ ఉపయోగించి కొంత మంది విజ్ఞానం ద్వారా సమాజానికి సేవ, వ్యక్తిగత అభివృద్ధి చెందుతుంటే అనేక మంది అజ్ఞానంలోకి వెళ్తున్నారని మూర్తిరాజు వివరించారు. దాదాపు పదిహేను వందల మందితో మూడు రోజులుగా సీవైఎఫ్ యువజన మహోత్సవాల్లో సెల్‌ఫోన్ వినియోగంపై యువతకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. అలాగే సామాజిక కార్యక్రమాలు రక్తదాన శిబిరం, జాబ్‌మేళా ఏర్పాటు చేశారు. ప్రపంచ సువార్త గాయకులు రెవరెండ్ జాన్ జబరాజ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచి ఆయన సంగీతంతో యువతను ఉర్రూతలూగించాయి. క్వీన్ విక్టోరియా, రాజ్ స్టీఫెన్ శక్తివంతమైన ఆరాధన చేసింది. రేస్ ఆఫ్ పీస్ వర్షిప్ సెంటర్ యూత్ ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. అలాగే సీవైఎఫ్ సేవలను అభినందిస్తూ డైరెక్టర్ బీహెచ్‌వీ మూర్తిరాజుకు మిరాకిల్ ఇంజినీరింగ్ అధినేత సహకారంతో గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ కో ఆర్డినేటర్ జాన్ వీక్లిఫ్, స్టేట్ కో ఆర్డినేటర్ సీకే సింగ్, స్టేట్ కో ఆర్డినేటర్ దూదిపాల్ శ్రీనివాస్, దడాల జాషువాగిరి, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ విజయభాస్కర్, పెయ్యల నానిబాబు, రాజాల ప్రవీణ్, మచ్చా బుజ్జిబాబు, వల్లూరి నానాజీ, వారా వినోద్, రాజాల సునీల్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుతో సహా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి బొడు యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

స్టార్టప్‌ల ప్రోత్సాహానికి సుబుకోటా కృషి

జేఎన్‌టీయూకే ఇన్‌చార్జ్ వీసీ మురళీకృష్ణ



విజేతలకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేసిన నిర్వాహకులు

బాలాజీచెరువు: సాంకేతిక విద్యను అభ్యసించే ఇంజినీరింగ్ విద్యార్థులు స్టార్టప్ దిశగా ఆలోచింపజేయడానికి సుబుకోటా ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయని జేఎన్‌టీయూకే ఇన్‌చార్జి వీసీ డాక్టర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో మంగళవారం నిర్వహించిన స్టార్టప్ ఫెస్ట్–24 కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ విద్యాసంస్థల్లో సృజనాత్మకత, ఆవిష్కరణ, వ్యవస్థాపకతకను పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జేఎన్‌టీయూకే పూర్వ విద్యార్థి సుబు ఎం.కోటా ఫౌండేషన్ స్థాపించి యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఇటీవలే కళాశాల అభివృద్ధికి రూ.కోటి రూపాయలు ప్రకటించారన్నారు. కనెక్టింగ్ బ్రెయిన్ విత్ టెక్‌రాక్స్, ఎడ్యు ఆల్ట్ టెక్, ఈఎల్ఆర్ఎస్, ప్రొగ్రెస్ పయినీర్, కనెక్టింగ్ బ్రెయిన్ విత్ టెక్‌స్టార్టప్‌లు మొదటి మూడు స్థానాల్లో నిలవగా ప్రథమ బహుమతి రూ.2.5లక్షలు, ద్వితీయ బహుమతి 1.5 లక్షలు, తృతీయ బహుమతి రూ.లక్ష అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపకుడు సుబ్బరాజు, ఇంక్యుబేషన్ డైరెక్టర్ కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ మోహనరావు, పి.సురేష్, కిరణ్, ఛీఫ్ ఇంజినీర్ శ్రీనివాసులు సీఎస్ఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ రఘు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీడీఓను కలసిన ఉపాధి సిబ్బంది



ఎంపీడీఓ సతీష్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఉపాధి సిబ్బంది

కాకినాడ రూరల్: మండల పరిషత్ అభివృద్ధి అధికారి పసుపులేటి సతీష్‌ను మంగళవారం ఉపాధి హామీ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. ఉపాధి హామీ మండల టెక్నికల్ అసిస్టెంట్ గణేష్ ఆధ్వర్యంలో సిబ్బంది పుష్ప గుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సతీష్ ఉపాధి హామీ పనులపై ఆరా తీసి అందరికీ పని కల్పించే దిశగా చూస్తానని హామీ ఇచ్చారు.



నవ లక్షణ శుభంకరీ

కరప: మండలంలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని, ఆలయాన్ని గ్రామస్తులు రూ.9లక్షల విలువైన కొత్త కరెన్సీ నోట్లతో తీర్చిదిద్దారు. ఆలయ అర్చకులు కొండేటి సత్యనారాయణమూర్తి, శివశర్మ అమ్మవారికి విశేష పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

అన్న క్యాంటిన్ల వివరాలు ఆన్‌లైన్ చేయండి



నోడల్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ భావన

నోడల్ అధికారులకు కమిషనర్ భావన ఆదేశం

కాకినాడ సిటీ: అన్న క్యాంటీన్ల నిర్వహణ సక్రమంగా జరిగేలా వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని నగరపాలక సంస్థ నోడల్ అధికారులను కమిషన్ భావన ఆదేశించారు. మంగళవారం కార్యాలయంలో నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నగరంలో ఉన్న ఐదు అన్న క్యాంటిన్ల నిర్వహణ పూర్తిగా పారదర్శకంగా ఉండేలా ప్రతి సమాచారాన్ని ఆన్‌లైన్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి వేళలో రోజుకు ఎంత మంది భోజనం చేశారు వంటి వివరాలను పూర్తిగా ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఆదేశించారు. దీనిపై ఉన్నత స్థాయిలో పర్యవేక్షణ ఉంటుందన్నారు. అన్న క్యాంటీన్ల నిర్వహణ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, పేదలకు నాణ్యమైన భోజనం అందేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ సుధాకర్, వార్డు సచివాలయాల అడ్మిన్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

చెత్త సేకరణలో నిర్లక్ష్యం వద్దు

తడి–పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే అంశంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని ఉపేక్షించబోమని నగరపాలక సంస్థ కమిషనర్ భావన స్పష్టం చేశారు. మంగళవారం ఆమె జగన్నాథపురం 23వ డివిజన్ మేకా వారివీధి, చిక్కాలవారివీధి ప్రాంతాల్లో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. ఇంటింటికీ చెత్త సేకరణ తీరును స్వయంగా పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి పారిశుధ్య సేవలను ఆరా తీశారు. విధుల్లో ఉన్న కార్మికులకు సూచనలు ఇచ్చారు. రహదారులు, డ్రైనేజీలను సకాలంలో శుభ్రం చేస్తున్నారో లేదో ఆరా తీశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తడిపొడి చెత్తను వేర్వేరుగా ఇచ్చేలా ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలు కూడా సహకరించినప్పుడే మరిన్ని మెరుగైన సేవలు అందించగలమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆమె వెంట ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్, ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భారత వైమానిక దళ దినోత్సవం



వైమానిక దళ విశ్రాంత ఉద్యోగి శ్రీనగేష్‌ను సత్కరించిన అడబాల ట్రస్ట్ సభ్యులు

కాకినాడ రూరల్: స్థానిక రమణయ్యపేటలో అడబాల ట్రస్టు ఆధ్వర్యంలో భారత వైమానిక దళం 92వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైమానిక దళ విశ్రాంత ఉద్యోగి ఎస్.శ్రీనగేష్ మాట్లాడుతూ 1932 అక్టోబర్ 8న బ్రిటిష్ పాలనలో సహాయదళంగా భారత వైమానిక దళం స్థాపించారని చెప్పారు. స్థాపనను స్మరించుకుంటూ ఏటా అక్టోబర్ 8న భారత వైమానిక దళ దినోత్సవం నిర్వసిస్తున్నామని పేర్కొన్నారు. ఇది శక్తివంతమైన, స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ అన్నారు. దశాబ్దాలుగా మన వైమానిక దళం ప్రపంచంలో అత్యంత బలీయమైనదిగా గుర్తింపు పొందిందని తెలిపారు. విశ్రాంత ఉపాధ్యాయులు నిమ్మకాయల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మన వైమానిక దళం మానవతా కార్యకలాపాలలో కూడా కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. భారతదేశ సార్వభౌమత్వాన్ని పరిరక్షించేందుకు, విపత్తు సహాయ చర్యల్లో పాల్గొంటూ నిరంతరం ధైర్య సాహసాలతో, అంకిత భావాలతో వైమానిక దళం పనిచేస్తుందని ఆయన తెలిపారు. అనంతరం అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీనగేషను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బుద్ధరాజు సత్యనారాయణ రాజు, పద్మ తులసి, ప్రసాద్ నాయుడు, చింతపల్లి సుబ్బారావు, కుమార్ యాదవ్, రాజా తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



బాణసంచా తయారీ కేంద్రాలను పరిశీలిస్తున్న సీఐ చైతన్యకృష్ణ, తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్సై సునీత

కరప: బాణసంచా తయారీ కేంద్రాల్లో నిబంధనలు పక్కాగా పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని సీఐ చైతన్య కృష్ణ, కరప తహసీల్దార్ నందిపాటి సత్యనారాయణ, ఎస్సై తోట సునీత హెచ్చరించారు. మండలం నడకుదురు, వేళంగి గ్రామాల్లోని నానాజీ, ధనలక్ష్మి, త్రిమూర్తులు బాణసంచా తయారీ కేంద్రాలను తనిఖీ చేసి వారి రికార్డులను, స్టాక్‌ను పరిశీలించారు. నైపుణ్యం కలిగిన వారిని మాత్రమే బాణసంచా తయారీకి వినియోగించాలని, తయారు చేసిన మందుగుండును నిర్దేశిత ప్రదేశాల్లో మాత్రమే భద్రపరచాలన్నారు. అనుమతికి మించిన నిల్వ ఉంటే సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. తయారీ ప్రదేశంలో నీళ్లు, ఇసుక, ఫైర్‌సేఫ్టీ పరికరాలు ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆపద సమయంలో అనుసరించాల్సిన పద్ధతులను నిర్వాహకులకు వివరించారు.

సినిమాలు



ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్:
దేవర పార్ట్–1, దక్షిణ,సత్య సుందరం
దేవీ మల్టీప్లెక్సు 4 స్క్రీన్స్:
దేవర పార్ట్–1, సత్య సుందరం, కాళీ

లక్ష్మి:	దేవర పార్ట్–1
సత్యగౌరి:	దేవర పార్ట్–1
తిరుమల:	దేవర పార్ట్–1
సీఅండ్‌సీ1:	మత్తువదలరా
సీఅండ్‌సీ2:	శ్వాగ్
శ్రీప్రియ:	రామ్ నగర్ బన్ని
పద్మప్రియ:	దేవర పార్ట్–1
సూర్య (వాకలపూడి):	దేవర పార్ట్–1
సూర్య2:	మిస్టర్ సెలబ్రిటీ


అంతటా అమ్మ నామమే..



సింహారోహణం అలంకరణలో దర్శనమిచ్చిన సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారు



దేవాలయంవీధిలోని భీమేశ్వరస్వామి ఆలయంలో కాళికాదేవి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు



రిజర్వుపోలీస్‌లైన్ అయ్యప్పస్వామి ఆలయంలో కామాక్షి అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు



అశోక్‌నగర్ సాయిబాబా ఆలయంలో మహాలక్ష్మిదేవి అలంకరణలో అమ్మవారిని నోట్లతో అలంకరించిన దృశ్యం



వ్యాఘ్రంపై కరప పర్వతవర్ధినీదేవి



భానులింగేశ్వరస్వామి ఆలయంలో మహాలక్ష్మిదేవిగా.. పెద్దపులిపై పర్వతవర్ధినీదేవి

- భక్తులతో ఆలయాలు కిటకిట
- వివిధ అలంకరణల్లో అమ్మ దర్శనం

బోట్‌క్లబ్: దసరా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు వివిధ అలంకరణలలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక బాలాత్రిపుర సుందరి ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా సింహారోహణం అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సత్కళావాహిని సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన కీర్తనలు భక్తులను అలరించాయి. హరిహర నృత్యభారతి అకాడమీ విద్యార్థుల నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపురసుందరి సమేత భీమేశ్వర ఆలయంలో అమ్మవారు కాళికాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. మధ్యాహ్నం ఆలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. స్థానిక భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మి అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక అశోక్‌నగర్ సాయిబాబా ఆలయంలో మహాలక్ష్మిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని రూ.20, రూ.10 నోట్లుతోన, నాణేలతో అలంకరించారు. అమ్మవారికి ఆలయ కమిటీ చైర్మన్ వేదుల అచ్యుతరామారావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక సంతచెరువు కనకదుర్గ ఆలయంలోను, శారదదేవి ఆలయంతో పాటు నగరంలోని పలు ఆలయాల్లో అమ్మవారు వివిధ అలంకరణలో దర్శనమిచ్చారు.

కరప: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కరపలో పర్వతవర్ధినీదేవి సింహారోహణ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానార్చకులు విలపర్తి శ్రీనివాస్, ఫణికుమార్ ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పెనుగుదురు సంతోషిమాత ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు.